డా. బీఆర్. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



వైసే సందేశ్‌కు దళితరత్న అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి

కవాడిగూడ: దళితుల అభ్యున్నతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంటస్వామి అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ నేతలు నియమించిన వైసే సందేశ్‌కు గురువారం దళిత రత్న అవార్డును ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మైసే సందేవ్ మాట్లాడుతూ.. ఏళ్లుగా దళిత ఉద్యమాల్లో పాల్గొంటూ దళితుల సమస్యలు పరిష్కరిస్తున్నందుకు తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సిటీ వైస్‌ప్రెసిడెంట్ కురుబ మహేందర్, నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్, జైభీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకుడు బలవంతరావు, నాయకులు పుణ్యభాను ప్రకాష్, సుధామాల అంజలి, మిద్దె లింగం తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ గ్రౌండ్ ఆధునీకరణకు శ్రీకారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన వాలీబాల్ గ్రౌండ్ ఆధునీకరణకు రూ.56 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. గురువారం వాలీబాల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వాలీబాల్ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, సిట్టింగ్ గ్యాలరీ, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతిరోజు వాలీబాల్ గ్రౌండ్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున క్రీడాకారులు వచ్చి వాలీబాల్, బీచ్ వాలీబాల్ ఆడుతారని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నవీన్‌గౌడ్, కంచిముదిరాజ్, గడ్డం నవీన్,రమేష్,భరత్, చింటూ పాల్గొన్నారు.

నేలకూలిన చెట్లు, స్తంభాలు



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో కురిసిన వర్షానికి చెట్లతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు నేలపై వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. స్థానికులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం విద్యుత్ శాఖ డీఈ కమల్‌కుమార్, ఏఈ సునీల్‌రెడ్డి కాలనీకి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. చెట్లకొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలపై పడ్డ చెట్ల కొమ్మలను యంత్రాల సహాయంతో తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మకం

● అంబర్‌పేట నియోజకవర్గంలో తిరంగా యాత్ర ● పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, పార్టీల నాయకులు

అంబర్‌పేట: పాకిస్తాన్‌పై సిందూర్ ఆపరేషన్ చరిత్రాత్మకమని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. గురువారం బీజేపీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ నేతలు చేపట్టిన తిరంగా ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన జెండా ఊరి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా పాకిస్తాన్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రతి భారతీయుడికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు చారి, గోవర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, చుక్క జగన్, ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, ఈఎస్ ధనుంజయ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికుల త్యాగాలకు వందనం

నల్లకుంట: దేశం కోసం త్యాగాలు చేస్తున్న 'సైనికులకు వందనం.. వారికి బాసటగా నిలుద్దాం'అని నల్లకుంట కార్పొరేటర్ అమృత పిలుపునిచ్చారు. పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాల ధ్వంసమే లక్ష్యంగా భారత త్రివిధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం నల్లకుంటలో తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా



నల్లకుంటలో తిరంగా యాత్రలో కార్పొరేటర్ అమృత, బీజేపీ నాయకులు

దేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని మన సైనికులు ప్రపంచదేశాలకు తెలియజేశారన్నారు. ఈ ఆపరేషన్‌లో తెలుగు వాడైన సైనికుడు మురళీనాయక్ వీరమరణం పొందారని గుర్తుచేశారు. ప్రతి భారతీయుడు సైనికులకు రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎంబీ కిషోర్‌కుమార్, కేజీ. బాబు, కె.లక్ష్మణ్‌కుమార్, వనం రమేష్, శ్యామ్‌రాజ్, ప్రశాంత్ జోషి, ఎం.మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైనిక శక్తి మరోసారి ప్రపంచానికి తెలిసింది..

కాచిగూడ: ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ సైనిక శక్తి మరోసారి ప్రపంచానికి తెలిసిందని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. గురువారం కార్పొరేటర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సి.నందకిషోర్ యాదవ్, చిట్టి శ్రీధర్, సుభాష్ పటేల్, సి.వినోద్ యాదవ్, అరవింద్, క్షీర్‌సాగర్, బి.భీమ్‌రాజ్, బల్వీర్, నర్సింగ్‌రావు, మల్లికార్జున్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేటలో తిరంగ ర్యాలీలో బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు



కాచిగూడలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్, బీజేపీ నాయకులు

అభివృద్ధిలో బస్తీలు, కాలనీలకు సమాన ప్రాధాన్యం

నల్లకుంట: అభివృద్ధిలో కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ, సీవరేజీ పైపుల నిర్మాణంతో పాటు సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రధానంగా ప్రజా రవాణాను మెరుగు పరచే దిశగా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్‌లో రూ.19లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపతినాథ్, శంకర్, మేడి ప్రసాద్, రఘురాం రెడ్డి, సాయిని మూర్తి, కేజీ.బాబు, లక్ష్మణ్‌కుమార్, ఎంబీ కిశోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

విశ్రాంత ఆర్‌టీఓ శివచరణ్ కన్నుమూత

చిక్కడపల్లి: నిజామాబాద్ అర్బన్ నియోజవర్గం పూర్వ ఎమ్మెల్యే నరాల హరినారాయణ తనయుడు విశ్రాంత ఆర్‌టీఓ. శివచరణ్(75) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆయనకు భార్య కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిక్కడపల్లి బాపునగర్‌లో నివసిస్తూ నిజామాబాద్‌తో పాటు పలు ప్రాంతాలలో ఆర్టీఓగా సేవలందించారు. నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్ ప్రాంతంలో ఈ నెల 23న అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ రంగ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



(ఫైల్)

బతుకమ్మకుంటలో కమిటీహాల్ నిర్మాణానికి సహకరించండి

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి చేయూతనివ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను గురువారం బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కోరారు. హైడ్రా కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో గురువారం కార్పొరేటర్ కలిశారు. బతుకమ్మకుంట స్థలాన్ని స్వాధీనం చేసుకుని చేస్తున్న అభివృద్ధికి తాము సహకరిస్తామని ఆమె తెలిపారు. అదే ప్రాంతంలో స్థానికులకు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి సహకరించాలని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీహాల్ నిర్మాణానికి అనుమతి ఇస్తే జీహెచ్‌ఎంసీ, ఎమ్మెల్యే సహకారంతో నిధులు సమకూర్చుకునేందుకు పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, జెమ్మిశెట్టి బాల్‌రాజ్, గోవింద్ అర్జున్, శేఖర్, రమేష్, బాలకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

కల్లు తాగించి ఆభరణాలు దోచుకున్న నిందితురాలి అరెస్టు

చిక్కడపల్లి: కల్లు తాగించి నగదు, బంగారు ఆభరణాలను దోచుకున్న నిందితురాలిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి కొంత నగదును ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఐ శంకర్ మలోత్ ఎస్సై మౌనికలతో కలసి వివరాలు వెల్లడించారు. ముషీరాబాద్ మహాత్మానగర్ కాలనీకి చెందిన బాధితురాలు సత్యమ్మ జీహెచ్‌ఎంసీలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. మల్లేపల్లి ధోబీఘాట్ అఫ్జల్‌సాగర్‌కు చెందిన నిందితురాలు కొంతం సోనీ (షహనాజ్ బేగం) (36), ఈ జనవరి 17న బాధితురాలు సత్యమ్మను చిక్కడపల్లిలోని శ్రీసాయి బార్‌కు తీసుకెళ్లి కల్లు తాగించింది. సత్యమ్మ మత్తులోకి జారుకోగానే ఆమె వద్ద ఉన్న రూ.20,000 నగదు, ఇన్ఫినిక్స్ మొబైల్ ఆమె ఐదు గ్రాముల ఉన్న బంగారు, 5 గ్రాముల బరువున్న వెండి ఆభరణాలు, ఏటీఎం, ఈఎస్ఐ, ఇల్లు, అల్మారి కీని(తాళం చెవి) బలవంతంగా తీసుకుంది. సత్యమ్మను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి నిందితురాలిని అరెస్టు చేశారు. నిందితురాలుపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు.

ఫార్మసీ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

నల్లకుంట: ఫార్మసీ యాక్ట్ 1948చట్టాలు అమలు చేసి, ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ తదితరులు వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

చిక్కడపల్లి: నరమేధాన్ని కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పలు వామపక్షాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని ఆపాలని గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు పశ్య పద్మ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యవర్గ సభ్యుడు ఎం.హనుమేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వెంకటరామయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. శత్రు దేశమైన పాకిస్తాన్‌తో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్న కేంద్రం మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు.

◆ మొన్న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావుతో పాటు 25మంది మృతిపై సుప్రీంకోర్టు జడ్జీతో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అణచివేస్తూ చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల్లో 550 మందిని చంపేశారని తెలిపారు. ఆదివాసులను తరిమివేసి ఆ అడవుల్లో ఉన్న ఖనిజాలను అదానీ, అంబానీలకు అప్పజెప్పాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈ నిరసనలో ఎస్‌సీపీఐయూ రాష్ట్ర నాయకుడు సుధాకర్, మురహరి, సీపీఐ ఎంఎల్ నాయకులు గోవర్ధన్, వెంకటేశ్వర్‌రావు, ఎల్ఎల్ పద్మ, ప్రదీప్, వెంకటేష్, స్టాలిన్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వామపక్ష నాయకుల నిరసన

తొలి సంఘ సంస్కర్త రాజా రామ్‌మోహన్‌రాయ్

చిక్కడపల్లి: సాంఘీక దురాచారాలు, మూఢ విశ్వాసాలను రూపమాపేందుకు కృషి చేసిన తొలి సంఘ సంస్కర్త రాజా రామ్‌మోహన్‌రాయ్ అని శ్రీవేంకటేశ్వర విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో గురువారం 'రాజా రామ్‌మోహన్‌రాయ్ యాదిలో..'అనే శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూఢ విశ్వాసాలు, ఆచారాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించారని కొనియాడారు. గ్రంథాల పేరిట జరుగుతున్న అమానవీయ పరిస్థితులను ఎదురించి నిలిచిన మహనీయుడని అన్నారు. భర్త మరణిస్తే భార్యను శవంతో పాటు నిప్పు పెట్టే ఆచారాన్ని రూపుమాపేందుకు బ్రిటిష్ పాలకులతో కలసి చట్టాన్ని తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు శైలజామిత్ర, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, పీఎస్‌ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాల బాలికల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని తెలంగాణ బాలోత్సవ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 18 రోజుల పాటు జరిగిన సమ్మర్ క్యాంపు ముగింపు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఈ క్యాంపులో ఫన్‌మ్యాథ్స్, సైన్స్ ప్రయోగాలు, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, మ్యాజిక్, ఆటపాటలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించామని తెలిపారు. చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్యాంపులో సుమారు 85మంది విద్యార్థులు శిక్షణ పొందారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి ఎస్.సోమయ్య, ఉపాధ్యాక్షురాలు కె. సుజావతి, ఉపాధ్యాయురాలు అంకమ్మ, బుచ్చిరెడ్డి, బ్రహ్మణి పాల్గొన్నారు.



బాలోత్సవం ముగింపు వేడుకలో చిన్నారులు

యువతి అదృశ్యం

నల్లకుంట: ఇంటి నుంచి వెళిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకు చెందిన చంద సునీత 20 ఏళ్ల క్రితం భర్త చనిపోవడంతో జీవనోపాధి కోసం ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చింది. కూలీ పనులు చేస్తూ పెద్ద కుమార్తె లక్ష్మి వివాహం చేసింది. మానసికస్థితి సరిగాలేని చిన్న కుమార్తె సీహెచ్. ఆర్తీ(20)తో కలిసి శివం రోడ్డు సాయిబాబా కమాన్ సమీపంలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఈనెల 20న రాత్రి 10.30గంటలకు చిన్న కుమార్తె ఆర్తీ తాను బయటకు వెళ్తున్నానని చెప్పి ఓ కవర్ తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంటనే తల్లి అనుసరిస్తూ వెళ్లగా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సిగ్నల్స్ వరకు వెళ్లిన ఆర్తీ అక్కడి నుంచి చాదిరేన్ వైపు పరుగులు తీసింది. తల్లి సునీత స్థానికంగా ఉండే గౌతం అనే తెలిసిన వ్యక్తి సహాయంతో పాత నల్లకుంట పరిసరాలలో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన సునీత తమ కుమార్తె కనిపించడం లేదంటూ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఆర్తీ (ఫైల్)

ఇంజినీరింగ్ ఫీజులు పెంచాలనే ఆలోచన సరికాదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో ఇంజినీరింగ్ ఫీజులు పెంచాలనే ఆలోచన చేయడం సరికాదని ఏఐఎఫ్‌బీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున అన్నారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఫీజులు పెంచకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ.. డొనేషన్ల పేరుతో లక్షాది రూపాయలు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కాలేజీల ఫీజుల పెంచాలంటూ టీఏఎఫ్‌ఆర్సీ ముందు ప్రతిపాదనలు పెట్టారని ఆ ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయం చేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీఎస్ ప్రతినిధులు పల్లె మురళి, మట్టయ్య, మాస్ సావిత్రి, జంబార్ నాయక్, పోతుగంటి కాశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం నాగార్జున

వివేక్‌నగర్‌ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, జైసింహ, కార్పొరేటర్ పావని దంపతులు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, అరవింద్‌యాదవ్, చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ దేవనాథం







వీరాంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ పావని పూజలు



జై హనుమాన్

రామ లక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్‌కి.!

● అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో హనుమ జయంతి
● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేటర్లు, భక్తులు



స్వామివారి పల్లకీసేవలో అంబర్‌పేట బీజేపీ నాయకులు, భక్తులు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో **గురువారం** హనుమ జయంతి పర్వదినాన్ని **భక్తిశ్రద్ధలతో నిర్వ**హించారు. తెల్లవారుజాము నుంచే **భక్తులు దేవాలయా**లకు చేరుకుని ఆంజనేయస్వామిని **దర్శించుకున్నారు**. వేదపండితులు సింధూర అభిషేకం, **పంచామృత అభి**షేకం, ఆకుపూజ, వడమాల పూజ, **అర్చనలు చేశారు**. దేవాలయాల్లో హనుమాన్ చాలీసా **పారాయణం**, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 'రామ లక్ష్మణ జానకీ జైబోలో హనుమాన్‌కి'.. 'జై శ్రీరామ్'అనే నినాదాలతో దేవాలయాల ప్రాంగణాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మధ్యాహ్నం ఆలయాల ప్రాంగణాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. భక్తి భావనతో మంచి నడవడిక ఏర్పడుతుందని అన్నారు. ఆధ్యాత్మిక చింతనను ప్రతి భక్తుడు అలవర్చుకోవాలని సూచించారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు



పూజలో బిజ్జి కనకేష్‌కుమార్



హర్రాస్‌పెంటలోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అంబర్‌పేటలో జరిగిన పూజలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



బాగ్‌అంబర్‌పేట సాయిబాబా మందిరంలోని హనుమంతుడికి తమలపాకులతో పూజలు



న్యూనల్లకుంట న్యూ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222